## హైదరాబాద్ బీఈ యూనిట్ విస్తరణ

హైదరాబాద్, ఫిబ్రవరి 25: ప్రముఖ ఫార్మా సంస్థ బయోలాజికల్ లిమిటెడ్(బీఈ)..తక్కువ, మధ్యస్థాయి ఆదాయం కలిగిన దేశాల్లో చికెన్‌గున్యా వ్యాక్సిన్‌ను అందించడానికి బవేరియన్ నార్డిక్‌తో ఒప్పందాన్ని కుదుర్చుకున్నది. ఈ వ్యూహాత్మక ఒప్పందంలో భాగంగా చికెన్‌గున్యా వ్యాక్సిన్ తయారు చేయడానికి వినియోగించే టెక్నాలజీని ఇరు సంస్థలు పంచుకోనున్నాయి. ఈ వ్యాక్సిన్‌ను తయారు చేయడానికి హైదరాబాద్‌లోని జినోమ్ వ్యాలీలో ఉన్న ప్లాంట్‌ను ఆధునీకరించనున్నట్లు బీఈ లిమిటెడ్ ఎండీ మహిమా దాట్లా తెలిపారు. దీంతో కొత్తగా 300 మందికి ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయని పేర్కొన్నారు. ఇందుకోసం ఎంతమేర పెట్టుబడులు పెట్టనున్న విషయాన్ని మాత్రం సంస్థ వెల్లడించలేదు. అంతర్జాతీయ దేశాల్లో చికెన్‌గున్యా వ్యాక్సిన్ అందించాలనే ఉద్దేశంతో ఈ ఒప్పందం కుదుర్చుకున్నట్లు బవేరియన్ నార్డిక్ ప్రెసిడెంట్, సీఈవో పాల్ చాప్లిన్ తెలిపారు.

## హైదరాబాద్‌లో ప్రోజో రెండు గిడ్డంగులు

హైదరాబాద్, ఫిబ్రవరి 25: దక్షిణ భారతంలో వ్యాపార విస్తరణలో భాగంగా హైదరాబాద్‌లో ఒకేసారి రెండు ఫుల్‌ఫిల్‌మెంట్ సెంటర్లను ప్రారంభించింది ప్రోజో. 82 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన ఈ సెంటర్లతో క్లయింట్లకు వేగవంతమైన సేవలు అందించడానికి వీలు పడనున్నదని కంపెనీ వర్గాలు వెల్లడించాయి. దీంతో సంస్థకు తెలంగాణలో 10 ఫుల్‌ఫిల్‌మెంట్ సెంటర్లువుండగా, అదే దేశవ్యాప్తంగా 40 ఉన్నాయి.


## రివోల్ట్ మరో బైకు

- ధర రూ.1.15 లక్షలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 25: విద్యుత్‌తో నడిచే వాహనాల తయారీ సంస్థ రివోల్ట్ మోటర్స్ ..దేశీయ మార్కెట్లోకి మరో మాడల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఆర్‌వీ బ్లేజెక్స్ పేరుతో విడుదల చేసిన ఈ బైకు ధర రూ.1.15 లక్షలుగా నిర్ణయించింది. 3.24 కిలోవాట్ల బ్యాటరీతో తీర్చిదిద్దిన ఈ బైకు సింగిల్ చార్జింగ్‌తో 150 కిలోమీటర్లు ప్రయాణించనున్నది. రూ.500 చెల్లించి బుకింగ్ చేసుకున్న కస్టమర్లకు వచ్చే నెల నుంచి డెలివరీ చేయబోతున్నట్లు ప్రకటించింది. ఈ బైకుపై మూడేండ్లు లేదా 45 వేల కిలోమీటర్ల వ్యారెంటీ కల్పిస్తున్నది. గంటకు 85 కిలోమీటర్ల వేగంతో దూసుకుపోవచ్చును. కేవలం 80 నిమిషాల్లోనే 80 శాతం బ్యాటరీ రీచార్జికానున్నది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 200 విక్రయ అవుట్‌లెట్లు ఉండగా, ఈ ఏడాది చివరినాటికి వీటిని 500కి పెంచుకోనున్నట్లు కంపెనీ వర్గాలు వెల్లడించాయి.

# ఈ వృద్ధితో ఉద్యోగాలు పుట్టవ్

## దేశ జీడీపీ ఇంకా పెరిగితేనే కొత్త కొలువులు • ఆర్బీఐ మాజీ గవర్నర్ రాజన్



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 25: ఇటీవలికాలంలో బలహీనపడ్డ భారత ఆర్థిక వ్యవస్థ తిరిగి పుంజుకునే అవకాశాలు కనిపిస్తున్నాయని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్ అన్నారు. ఇప్పటికే అటు కేంద్ర ప్రభుత్వం, ఇటు ఆర్బీఐ, ఇంకో వైపు ఆయా రేటింగ్ ఏజెన్సీలు కూడా ఇదే అంచనాల్ని వ్యక్తం చేస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే ఈసారి జీడీపీ వృద్ధి రేటు అంచనాలను కూడా పెంచుతున్నాయి. అయితే ఈ అంచనాలు ఏమంత గొప్పగా లేవని రాజన్ పెదవి విరిచారు. ప్రస్తుతం చికాగో యూనివర్సిటీ బూత్ స్కూల్ ఆఫ్ బిజినెస్‌లో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న రాజన్.. తాజాగా ఓ బ్లూంబర్గ్ టెలివిజన్ ప్రతినిధికి ఇంటర్వ్యూ ఇచ్చారు. ఈ సందర్భంగానే మాట్లాడుతూ.. దేశ జీడీపీ గాడినపడుతున్నదని ఆనందించాల్సిన అవసరం లేదని, ఇప్పుడున్న వృద్ధి అంచనాలు.. కొత్తగా జాబ్ మార్కెట్‌లోకి రాబోయే వాళ్లకు సరిపడా ఉద్యోగాలను సృష్టించలేవని తేల్చిచెప్పారు.

**ఇంకో 2 శాతం పెరగాలి**

ఈ ఆర్థిక సంవత్సరం (2024-25) మూడో త్రైమాసికం (అక్టోబర్-డిసెంబర్)లో దేశ జీడీపీ వృద్ధిరేటు 6 శాతానికిపైగానే ఉంటుందన్న అంచనాలు విస్తృతంగా వస్తున్న సంగతి విదితమే. బ్లూంబర్గ్ సర్వేలో ఆర్థికవేత్తలు సైతం ఇదే చెప్పారు. జూలై-సెప్టెంబర్‌తో పోల్చితే (నాడు ఏడు త్రైమాసికాల కనిష్ఠ స్థాయిని తాకుతూ 5.4 శాతంగా నమోదైంది) ఇది ఎక్కువే. అయినప్పటికీ భారత్ ఇంకా మెరుగైన వృద్ధిరేటును సాధించవచ్చని రాజన్ అభిప్రాయపడ్డారు. ఇంకో 2 శాతం పెరిగి 8 శాతం స్థాయిని అందుకోవాలని, అప్పుడే ఏటా మార్కెట్‌లోకి వస్తున్న నిరుద్యోగ యువతకు తగ్గ ఉద్యోగావకాశాలను సృష్టించగలమని పేర్కొన్నారు. ప్రపంచంలోనే అత్యంత జనాభా కలిగిన భారత్‌కు ఇప్పుడున్న స్థాయి వృద్ధి సరికాదన్నారు. కాగా, ఈ శుక్రవారం అక్టోబర్-డిసెంబర్‌కుగాను దేశ జీడీపీ గణాంకాలు అధికారికంగా విడుదల కానున్నాయి.

**వడ్డీరేట్లు తగ్గిస్తే చాలదు**

మందగించిన దేశ జీడీపీ వృద్ధిరేటును పరుగులు పెట్టించేందుకు దాదాపు ఐదేండ్ల తర్వాత ఆర్బీఐ ఇటీవలి ద్రవ్యసమీక్షలో కీలక వడ్డీరేటును పావు శాతం కోత పెట్టినది తెలిసిందే. ఈ నెలారంభంలో కొత్త గవర్నర్ సంజయ్ మల్హోత్రా రెపో రేటును 6.50 శాతం నుంచి 6.25 శాతానికి తెచ్చారు. దీంతో ఆయా బ్యాంకులూ తమ రుణాలపై వడ్డీరేట్లను తగ్గిస్తున్నాయి. అయితే ఎకానమీని బలపర్చేందుకు ఈ నిర్ణయం ఒక్కటే చాలదని రాజన్ వ్యాఖ్యానించారు. యువతలో నైపుణ్యాభివృద్ధికి దోహదం చేసే చర్యలు కూడా తీసుకోవాల్సి ఉందన్నారు. ఉద్యోగావకాశాలు ఎంతగా పెరిగితే ఆర్థిక వ్యవస్థ కార్యకలాపాలు అంత గట్టిగా సాగుతున్నట్టవుతుందన్నారు.

**ట్రంప్ టారీఫ్‌లపై..**

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. తమ దేశంలోకి దిగుమతయ్యే వస్తు,సేవలపై అధిక సుంకాలను ప్రకటిస్తున్నది చూస్తూనే ఉన్నాం. ఈ కారణంగానే దేశీయ స్టాక్ మార్కెట్లు సైతం తీవ్ర ఒడిదొడుకులకు లోనవుతున్నాయి. అయితే ఈ సుంకాలపై రాజన్ స్పందిస్తూ.. అమెరికాతో సత్సంబంధాలు లాభదాయకమని, ఆ దేశం నుంచి చమురు, రక్షణపరమైన కొనుగోళ్లను పెంచడం మంచిదని అభిప్రాయపడ్డారు. అలాగే చాలా వస్తూత్పత్తులపై భారత్ సుంకాలను తగ్గించే వీలుందన్నారు. నిజానికి దీనివల్ల దేశ వృద్ధిరేటు ప్రగతికి వచ్చే నష్టమేమీ లేదన్న ఆయన.. పైగా పరిశ్రమలో పోటీ వాతావరణం నెలకొంటుందని, అది మంచిదేనని వ్యాఖ్యానించారు. ఇక ఆర్బీఐ గవర్నర్‌గా 2013 నుంచి 2016 వరకు రాజన్ పనిచేశారు.

# రాష్ట్రంలో మెగా డ్రై పోర్టు

## ప్రత్యేక రైలు, రోడ్డు మార్గాలతో ఏపీ సీ పోర్టుకు అనుసంధానం

## సీఎం రేవంత్ రెడ్డి వెల్లడి.. బయోఏషియా-2025 సదస్సు ప్రారంభం

హైదరాబాద్, ఫిబ్రవరి 25 (నమస్తే తెలంగాణ): 'తెలంగాణ భూ పరివేష్టిత రాష్ట్రం. అందుకే ఇక్కడ ఒక మెగా డ్రై పోర్టును అభివృద్ధి చేసి.. దానికి ఆంధ్రప్రదేశ్‌లోని సీ పోర్ట్‌కు అనుసంధానం ఉండేలా ప్రత్యేక రైలు, రోడ్డు రవాణా సదుపాయాలు అభివృద్ధి చేస్తాం' అని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. బయో సైన్సెస్, బయోటెక్, లైఫ్ సైన్సెస్ రంగాల్లో ప్రపంచంలోనే అత్యుత్తమ పర్యావరణ వ్యవస్థకు చిరునామాగా హైదరాబాద్‌ను అభివృద్ధిపర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు ఆయన పేర్కొన్నారు. బయోఏషియా-2025 వార్షిక సదస్సును మంగళవారం సీఎం రేవంత్ రెడ్డి హైదరాబాద్‌లోని హెచ్‌ఐసీసీలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బయోఏషియా సదస్సు హైదరాబాద్‌ను ప్రపంచ లైఫ్ సైన్సెస్ రాజధానిగా నిలబెట్టిందన్నారు. హెల్త్‌కేర్ రంగంలో ప్రపంచానికి మార్గదర్శనం చేసే కార్యక్రమంగా బయోఏషియా సదస్సు నిలుస్తున్నదన్నారు.

**ట్రిలియన్ డాలర్లకు..**

ప్రపంచంలో పేరొందిన ఫార్మా కంపెనీలు, హెల్త్ కేర్, లైఫ్ సైన్స్ మరియు బయో టెక్ కంపెనీలెన్నో హైదరాబాద్ నుంచి పని చేస్తున్నాయని, రాబోయే పదేండ్లలో తెలంగాణను



ఒక ట్రిలియన్ (లక్ష కోట్లు) డాలర్ల రాష్ట్ర ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలనే లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. ఈ వేదికపై మరో నాలుగు బహుళజాతి కంపెనీలను మా పర్యావరణ వ్యవస్థలోకి స్వాగతిస్తున్నామన్న ఆయన.. గత 25 సంవత్సరాలలో హైదరాబాద్.. ఫార్మా తయారీ, ఐటీ, డిజిటల్ హెల్త్ పవర్ హౌస్‌గా పేరుగాంచిందన్నారు. కాగా, జీనోమ్ వ్యాలీ ఎక్సలెన్స్ అవార్డును పొందిన ప్రొఫెసర్ పాట్రిక్ టాన్‌ను సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు.

**క్వీన్స్‌లాండ్ ప్రతినిధులతో సమావేశం..**

ఆస్ట్రేలియాలోని క్వీన్స్ ల్యాండ్ స్టేట్ ప్రతినిధులతో హైచ్‌ఐసీసీలో సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణలో పరిశ్రమలు, స్పోర్ట్స్ యూనివర్సిటీ, ట్రేడింగ్, ఇతర రంగాల్లో పెట్టుబడులు, ఒప్పందాలపై చర్చించారు. వారు సానుకూలంగా స్పందించారు.

## ఎట్టకేలకు లాభాల్లోకి సూచీలు

**సెన్సెక్స్ 148 పాయింట్లు వృద్ధి**

ముంబై, ఫిబ్రవరి 25: దేశీయ స్టాక్ మార్కెట్లు ఎట్టకేలకు లాభాల్లోకి మళ్లాయి. వరుసగా ఐదు రోజులుగా పతనమైన సూచీలకు ఫైనాన్షియల్, ఎఫ్‌ఎంసీజీ షేర్ల నుంచి లభించిన మద్దతుతో తిరిగి కోలుకున్నాయి. ఇంట్రాడేలో 300 పాయింట్లకు పైగా లాభపడిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు మార్కెట్ ముగిసే సమయానికి 147.71 పాయింట్ల లాభంతో 74,602 వద్ద నిలిచింది. మరో సూచీ నిఫ్టీ మాత్రం వరుసగా ఆరోరోజూ నష్టపోయింది. 5.80 పాయింట్లు కోల్పోయి 22,547.55 వద్దకు జారుకున్నది. ఫార్మా, మెటల్, ఐటీ రంగ షేర్లు తీవ్ర ఒత్తిడికి గురికావడంతో సూచీ తగ్గుముఖం పట్టింది. మార్కెట్లో మహీంద్రా అండ్ మహీంద్రా 2.61 శాతం పెరిగి టాప్ గెయినర్‌గా నిలిచింది. భారతీ ఎయిర్‌టెల్ 2.55 శాతం బలపడింది. దీంతోపాటు జొమాటో, నెస్లె, బజాజ్ ఫిన్‌సర్వ్, మారుతి, టైటాన్ షేర్లు లాభాల్లో ముగిశాయి. కానీ, సన్ ఫార్మా, పవర్ గ్రిడ్, టీసీఎస్, టెక్ మహీంద్రా, ఏషియన్ పెయింట్స్, టాటా మోటర్స్ షేర్లు నష్టపోయాయి. గత ఐదు సెషన్లలో సెన్సెక్స్ 1,542.45 పాయింట్లు లేదా 2 శాతం మేర నష్టపోయిన విషయం తెలిసిందే.

# ప్రైవేటుకు 13 ఎయిర్‌పోర్టులు?

## వచ్చే ఏడాది మార్చికల్లా అమ్మేయాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 25: విమానాశ్రయాల ప్రైవేటీకరణను మోదీ సర్కారు మళ్లీ మొదలుపెట్టింది. ప్రభుత్వ ఆస్తుల నగదీకరణ నుంచి పెద్ద ఎత్తున ఆదాయాన్ని పొందాలన్న లక్ష్యం పెట్టుకున్న కేంద్రం.. ఏకంగా వచ్చే ఏడాది మార్చికల్లా దేశంలోని 13 ఎయిర్‌పోర్టులను ప్రైవేట్‌పరం చేయాలని చూస్తున్నట్టు తెలుస్తున్నది. ఇప్పటికే పౌర విమానయాన మంత్రిత్వ శాఖ ఈ అంశాన్ని ఇంటర్-మినిస్టీరియల్ కన్సల్టేషన్‌లో ప్రస్తావనకు తీసుకొచ్చినట్టు కూడా చెప్తున్నారు.



**ఇదీ సంగతి..**

జాతీయ నగదీకరణ ప్రణాళిక కింద 2022 నుంచి 2025 వరకు మొత్తం దేశవ్యాప్తంగా 25 ఎయిర్‌పోర్టులను ప్రైవేట్‌పరం చేయాలని కేంద్రం నిర్ణయించుకున్నది. వీటిలో భువనేశ్వర్, వారణాసి, అమృత్‌సర్, తిరుచ్చి, ఇండోర్, రాయ్‌పూర్, కాలీకట్, కోయంబత్తూర్, నాగ్‌పూర్, పాట్నా, మధురై, సూరత్, జోధ్‌పూర్, రాంచీ, చెన్నై, విజయవాడ, రాజమండ్రి, వడోదర, భోపాల్, తిరుపతి, హుబ్లీ, ఇంపాల్, అగర్తల, డెహ్రాడూన్, ఉదయ్‌పూర్ ఉన్నాయి. ఈ క్రమంలోనే ముందుగా ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా బోర్డు (ఏఏఐ) 13 ఎయిర్‌పోర్టులను గుర్తించింది. దీంతో వీటి ప్రైవేటీకరణకు పౌర విమానయాన మంత్రిత్వ శాఖ కేబినెట్ అనుమతికి సిద్ధమైంది. అయితే మధ్యప్రదేశ్ ప్రభుత్వం.. రాయ్‌పూర్, ఇండోర్ విమానాశ్రయాల ప్రైవేటీకరణకు అభ్యంతరం వ్యక్తం చేసింది. దీంతో సదరు జాబితా 11 ఎయిర్‌పోర్టులకు తగ్గింది. ఈలోగా గత ఏడాది లోక్‌సభ ఎన్నికలు రావడంతో ప్రైవేటీకరణకు బ్రేక్ పడింది. కానీ మూడోసారీ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వమే కొలువుదీరడంతో ఇప్పుడిక మళ్లీ విమానాశ్రయాల ప్రైవేటీకరణపై సర్కారు పెద్దలు దృష్టి సారించారు.

**విమర్శలు వస్తున్నా..**

ఎయిర్‌పోర్టుల ప్రైవేటీకరణపై రాష్ట్రాల నుంచి గట్టిగానే విమర్శలు వస్తున్నాయి. లాభాల్లో ఉన్న విమానాశ్రయాలు ఈ దెబ్బతో నష్టాల్లోకి జారుకుంటాయని, ప్రైవేట్ రంగంలో కొన్ని బడా కార్పొరేట్ సంస్థల గుత్తాధిపత్యంలోకి దేశీయ విమానయాన పరిశ్రమ వెళ్లిపోతుందన్న వాదనలూ వినిపిస్తున్నాయి. ప్యాసింజర్లపై అనవసరపు చార్జీలు వచ్చిపడతాయని, పారదర్శకత లోపిస్తుందని అంటున్నారు. ముఖ్యంగా అదానీ గ్రూప్ కోసమే ఈ ప్రైవేటీకరణ తంతు అన్న ఆరోపణలూ వస్తున్నాయి. ఇక ఇప్పటికే వచ్చే ఆర్థిక సంవత్సరానికి (2025-26)గాను ఈ నెల 1న పార్లమెంట్‌లో ప్రకటించిన బడ్జెట్‌లో.. రాబోయే ఐదేండ్లలో ప్రభుత్వ ఆస్తులను అమ్మి రూ.10 లక్షల కోట్లను ఖజానాకు తరలించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టం చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఎయిర్‌పోర్టుల ప్రైవేటీకరణ తిరిగి పట్టాలెక్కుతున్నది. ఇదిలావుంటే ప్రైవేటీకరణ ప్రక్రియలో భాగంగా తొలిసారి 6 పెద్ద ఎయిర్‌పోర్టులతో 7 చిన్న ఎయిర్‌పోర్టులను కలిపేయాలని భావిస్తున్నారు. వారణాసితో ఖుషీనగర్-గయా, అమృత్‌సర్‌తో కంగ్రా, భువనేశ్వర్‌తో తిరుపతి, రాయ్‌పూర్‌తో ఔరంగాబాద్, ఇండోర్‌తో జబల్‌పూర్, తిరుచిరాపల్లితో హుబ్లీ క్లబ్ చేయాలని చూస్తున్నారు.

## 'వద్దిరాజు'కు ఆహ్వానం



రాజ్యసభ సభ్యులు వద్దిరాజుకు ఆహ్వాన పత్రాన్ని అందిస్తున్న భాస్కర్, గాంధీ

ఖమ్మం, ఫిబ్రవరి 25: ఖమ్మం టైనీ-టాట్స్ హైస్కూల్ కరస్పాండెంట్ శెట్టి భాస్కర్, మున్నూరుకాపు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆకుల గాంధీలు రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్రను మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మార్చి 1న జరిగే టైనీ టాట్స్ హైస్కూల్ రజతోత్సవాలకు హాజరుకావాలని కోరారు. ఈ మేరకు వద్దిరాజుకు ఆహ్వానపత్రికను అందించారు.

## మారేశ్వరరావు మృతికి నివాళి

పెనుబల్లి, ఫిబ్రవరి 25: మండల పరిధిలోని కుప్పెనగుండ్ల గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు ఆవిటి మారేశ్వరరావు అనారోగ్యంతో మృతిచెందాడు. ఐసీడీ చైర్మన్ మువ్వా విజయబాబు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కనగాల వెంకట్రావు, మాజీ ఎంపీపీ లక్కినేని అలేఖ్య, వినీల్, మాజీ జడ్పీటీసీ చెక్కిలాల మోహన్‌రావు మృతదేహంపై పూలమాల వేసి నివాళి అర్పించారు. నివాళి అర్పించిన వారిలో నాయకులు చెక్కిలాల లక్ష్మణరావు, కోమటి ప్రసాద్, దొడ్డపునేని రవి, టీ.వీ.రామారావు, ఎస్.కే.గౌస్, సర్పంచ్ తేజావత్ తావునాయక్, తాళ్లూరి శేఖర్‌రావు, చలపతిరావు, శ్రీనివాసరావు, నాగదాసు, వెంకటకృష్ణ ఉన్నారు.

## ఉత్సాహంగా కొనసాగుతున్న టెన్నిస్ పోటీలు

ఖమ్మం సిటీ, ఫిబ్రవరి 25: ఖమ్మం పటేల్ స్టేడియంలో చల్లపల్లి రాధమ్మ మెమోరియల్ ఆధ్వర్యంలో ఆల్ ఇండియా టెన్నిస్ ఓపెన్ చాంపియన్‌షిప్ పోటీలు ఉత్సాహభరితంగా కొనసాగుతున్నాయి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లతోపాటు దేశంలోని పలు రాష్ట్రాల నుంచి వచ్చిన క్రీడాకారులు గెలుపే లక్ష్యంగా శక్తి యుక్తులన్నీ కూడగట్టుకుని ఆడుతున్నారు. మంగళవారం పురుషుల విభాగంలో సింగిల్స్, డబుల్స్ పోటీలు జరిగాయి. రెండింటిలోనూ 16 చొప్పున జట్లు ఆడాయి. పోటీలను జిల్లా టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్షుడు చల్లపల్లి శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ అనిల్ కాసినేని, ట్రెజరర్ కాంపాటి సత్యనారాయణ, చీఫ్ రిఫరీ ప్రవీణ్‌నాయక్, కాళ్ల పాపారావు, ఆర్గనైజింగ్ సెక్రెటరీ రమేష్, కాళ్ల సూర్య పర్యవేక్షించారు.

## మెగాజాబ్ మేళాకు విశేష స్పందన

ఖమ్మం అర్బన్, ఫిబ్రవరి 25: ఖమ్మం నగరంలోని ఎస్‌ఆర్‌బీజీఎన్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం నిర్వహించిన జాబ్‌మేళాకు విశేష స్పందన లభించినట్లు ప్రిన్సిపాల్ జాకీరుల్లా తెలిపారు. 426 మంది అభ్యర్థులు హాజరుకాగా.. 8 కంపెనీలకు 198 మంది ఎంపికైనట్లు వివరించారు.

## జిల్లాస్థాయి పోటీలు

ఖమ్మం అర్బన్, ఫిబ్రవరి 25: ఖమ్మంలోని ఎస్‌ఆర్‌బీజీఎన్‌ఆర్ కళాశాలలో భౌతికశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో పలు అంశాల్లో మంగళవారం జిల్లాస్థాయి పోటీలు నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేట్ డిగ్రీ కళాశాలల నుంచి విద్యార్థులు హాజరయ్యారు. విజేతలకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జాకీరుల్లా, బీ.శ్రీనివాస్, కిరణ్‌కుమార్, రాజశేఖర్, ధర్మయ్య, అనురాధ పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ ఓటు హక్కుదారులకు 27న సెలవు

నల్లగొండ, ఫిబ్రవరి 25: కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈ నెల 27వ తేదీన వరంగల్-ఖమ్మం-నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు కలిగి ఉన్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఈ నెల 27న ప్రత్యేక సాదారణ సెలవును మంజూరు చేస్తున్నట్లు కలెక్టర్, ఎన్నికల ఆర్వో ఇలా త్రిపాఠి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అదే విదంగా ఎంజీయూ, డీఐవో, డీఈవోలు ఎన్నికల ఆదేశానుసారం వారి పరిదిలో ఉన్న ఉద్యోగులు తమ ఓటు హక్కు వినియోగించుకునేలా చూడాలని ఆమె సూచించారు.

**పోలింగ్ నిర్వహిస్తున్న విద్యా సంస్థలకు 27న సెలవు**

వరంగల్-ఖమ్మం-నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ నిర్వహిస్తున్న విద్యాసంస్థలకు, కార్యాలయలకు ఈ నెల 27న సెలవు ప్రకటిస్తున్నట్లు ఆర్వో, కలెక్టర్ ఇలా త్రిపాఠి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 27 పోలింగ్ కేంద్రాలు ఉన్నందును ఆయా విద్యా సంస్థల, కార్యాలయ అదిపతులు ఆ రోజు సెలవు ప్రకటించాలని ఆమె ఆదేశించారు.

# ఈసీ నిబంధనలా? తూచ్!

- ఖమ్మం పెద్దాసుపత్రిలో ఓ ఉద్యోగ సంఘం నిర్వాకం
- సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రుల ఫొటోలతో ఫ్లెక్సీలు
- నవంబర్‌లో ముగిసినా ఇప్పటికీ అక్కడే దర్శనం
- వైద్యాధికారుల నిర్లక్ష్యం పట్ల రోగుల అసహనం




ఆసుపత్రి మధ్య గేటు పక్కన ఉన ఫ్లెక్సీ

ఖమ్మం సిటీ, ఫిబ్రవరి 25: ఎలక్షన్ కమిషన్ నిబంధనలు ఎంతో కఠినం. ప్రధానమంత్రి అయినా, ముఖ్యమంత్రి అయినప్పటికీ తప్పక పాటించాలి. ఐఏఎస్ నుంచి కిందిస్థాయి క్యాడర్ ఎవరైనా సరే వాటిని అనుసరించి విధులు నిర్వర్తించాల్సిందే. ఏమాత్రం అలసత్వం ప్రదర్శించినా శిక్షార్హులే. కానీ, జిల్లా సార్వజనీన ఆసుపత్రి వర్గాలకు, అక్కడి ఓ ఉద్యోగ సంఘానికి ఎన్నికల సంఘం (ఈసీ) నిబంధనలు పెద్దగా పట్టినట్లు కన్పించడం లేదు. తాజాగా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా ఎన్నికల నియమావళి అమలులో ఉన్నప్పటికీ ఓ ఉద్యోగ సంఘం ప్రదర్శిస్తున్న నిర్వాకం పట్ల ఇక్కడి రోగులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఉమ్మడి ఖమ్మం జిల్లాలో టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉంది. రాష్ట్ర ఎలక్షన్ ఎమిషన్ ఆదేశానుసారం గత జనవరి 29న షెడ్యూల్ విడుదలైన నాటి నుంచి ఈ కోడ్ కొనసాగుతున్నది. గురువారం ఎన్నికలు జరుగనున్నవి. ఈ నేపథ్యంలో అన్ని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో రాజకీయ పార్టీలు, వృత్తి, ఉద్యోగ, కుల సంఘాలకు చెందిన విగ్రహాలు, పోస్టర్లతోపాటు ఇతర అన్ని రకాల ప్రచారపరమైన బొమ్మలను కూడా కన్పించకుండా అధికారులు చర్యలు తీసుకున్నారు. కానీ ఖమ్మం పెద్దాసుపత్రి వర్గాలు మాత్రం ఈ తరహా చర్యలపై దృష్టి సారించినట్లు లేదు. ఇష్టానుసారంగా ఫ్లెక్సీలు ఏర్పాటుచేసి నెలలు గడుస్తున్నా వాటిని తొలగించకపోవడం గమనార్హం.

**ఫ్లెక్సీల్లో సీఎం, మంత్రుల ఫొటోలు**

గత కేసీఆర్ ప్రభుత్వ పాలనలో ఖమ్మం పెద్దాసుపత్రి ప్రాంగణంలోకి వెళ్లే మూడు ప్రధాన మార్గాల్లో వైద్యారోగ్య, వైద్య విధాన పరిషత్, మాతా శిశు సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో అందించే వైద్యసేవలతో కూడిన బోర్డులు కనిపించేవి. వాటిని చూసిన రోగులు ఎంతో నమ్మకంతో సర్కారు దవాఖానాల మెట్లెక్కేవారు. ప్రస్తుతం అక్కడ ఓ ఉద్యోగ సంఘం పేరుతో కూడిన ఫ్లెక్సీలు దర్శనమిస్తున్నాయి. వాటిపై సాక్షాత్తూ సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎంపీలు రేణుకాచౌదరి, రామసహాయం రఘురాంరెడ్డి, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నతోపాటు కలెక్టర్, సీపీ, టీఎన్జీవోస్, టీజీవోస్ సంఘాల నేతల ఫొటోలు ఉన్నాయి. వైద్యారోగ్యశాఖలో పని చేస్తూ ఉద్యోగ సంఘంలో పలు బాధ్యతలు మోస్తున్న వారి ఫొటోలు, పేర్లు కూడా ఉన్నాయి. కాగా, ప్రభుత్వాలు అందించే వైద్య కార్యక్రమాలను కనిపించకుండా చేయడం ఒక పొరపాటు అయితే, ఫ్లెక్సీలు ఏర్పాటుచేసిన తరుణం, తంతు ముగిసి దాదాపు మూడు నెలలు కావస్తున్నా తొలగించకపోవడం వంటివి విమర్శలక తావిస్తున్నాయి.

# ఇళ్ల స్థలాల కోసం దశలవారీ ఆందోళనలు

## మూడు జర్నలిస్టు యూనియన్ల సమావేశంలో నిర్ణయం

రఘునాథపాలెం, ఫిబ్రవరి 25: ఖమ్మం నియోజకవర్గంలో ఇళ్ల స్థలాల సాధన కోసం దశల వారీ పోరాటమే ఏకైక మార్గమని జర్నలిస్టు యూనియన్లు నిర్ణయించాయి. రాష్ట్ర ప్రభుత్వ గుర్తింపు పొందిన మూడు యూనియన్ల స్టీరింగ్ కమిటీ సమావేశం మంగళవారం ఖమ్మంలో జరిగింది. ఖమ్మం నియోజకవర్గంలోని జర్నలిస్టులందరికీ స్థలాల కోసం గత ప్రభుత్వం భూమి కేటాయించినప్పటికీ జర్నలిస్టు హౌజింగ్ సొసైటీకి భూమిని కేటాయించిన విషయంలో ప్రస్తుత ప్రభుత్వం తాత్సారం చేస్తోంది. దీంతో ఇళ్ల స్థలాల సాధనకు ఉద్యమమే శరణ్యమని మూడు యూనియన్లు భావించాయి. ఇదే లక్ష్యంతో పోరాడాలని తీర్మానించాయి. టీయూడబ్ల్యూజే (ఐజేయూ), టీయూడబ్ల్యూజే (టీజేఎఫ్) నేతలు, స్తంభాద్రి హౌజింగ్ సొసైటీ బాధ్యులు నర్వనేని వెంకట్రావు, వనం వెంకటేశ్వర్లు, చిర్రా రవి, కనకం సైదులు, సాంబశివరావు, శెట్టి రజనీకాంత్, రాము తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలకు పరామర్శ



నివాళి అర్పిస్తున్న లింగాల కమల్‌రాజు

మధిర, ఫిబ్రవరి 25: మున్సిపాలిటీ పరిధిలోని 9, 10వ వార్డుల్లో బాధిత కుటుంబాలను జిల్లా పరిషత్ మాజీ చైర్మన్, బీఆర్‌ఎస్ మధిర నియోజకవర్గ ఇన్‌చార్జి లింగాల కమల్‌రాజు మంగళవారం పరామర్శించారు. శంకర్‌శెట్టి నారాయణరావు అనారోగ్యంతో బాధపడుతుండగా పరామర్శించారు. వేమిరెడ్డి పెద్దిరెడ్డి ఇటీవల మృతిచెందగా వారి కుటుంబసభ్యులను పరామర్శించారు. మన్నెం అచ్యుతరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఆయన వెంట నాయకులు యన్నంశెట్టి అప్పారావు, ఆళ్ల నాగబాబు, పరిశ శ్రీనివాసరావు, ఎస్.కే.ఖాదర్, చీదిరాల రాంబాబు, అబ్దుల్ ఖురేష్, నాగులవంచ రామారావు, వీరంశెట్టి సీతారామయ్య, గుగులోతు కృష్ణానాయక్ తదితరులు పాల్గొన్నారు.

## 'సృజనాత్మకతలే వినూత్న ఆవిష్కరణలకు ఆధారం'




జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కళాశాల చైర్మన్

ఖమ్మం అర్బన్, ఫిబ్రవరి 25: సృజనాత్మకతతోనే వినూత్న ఆవిష్కరణలు రూపుదిద్దుకుంటాయని ఎస్‌బీఐటీ కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ పేర్కొన్నారు. ఖమ్మంలోని ఎస్‌బీఐటీ కళాశాల ఆవరణలో మంగళవారం నిర్వహించిన 'ప్రాజెక్ట్ ఎక్స్‌పో-2025' విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీసిందని అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఇన్నోవ్‌సెంట్రిక్ డైరెక్టర్ రాజశేఖర్‌తో కలిసి కళాశాల చైర్మన్ కృష్ణ జ్యోతి ప్రజ్వలన చేశారు. ఎక్స్‌పోలో 25 ఈసీఈ, 35 సీఎస్ఈ విభాగాలు ప్రాజెక్టులను ప్రదర్శించాయి. కరస్పాండెంట్ డాక్టర్ ధాత్రి, ప్రిన్సిపాల్, అధ్యాపకులు పాల్గొన్నారు.

## గవర్నర్‌ను కలిసిన మల్లెమడుగు విద్యార్థులు



గవర్నర్‌తో మల్లెమడుగు పాఠశాల విద్యార్థులు

రఘునాథపాలెం, ఫిబ్రవరి 25: ఖమ్మం అర్బన్ మండలం మల్లెమడుగు ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన 60 మంది విద్యార్థులు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు విద్యాశాఖ ఆధ్వర్యంలో తనను కలిసిన విద్యార్థులను గవర్నర్ అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థులు రాజ్‌భవన్‌ను చూసేందుకు సిబ్బందితో అవసరమైన ఏర్పాట్లు చేయించారు. ముందుగా విద్యార్థులు శివరాత్రి పండుగ ప్రాధాన్యాన్ని చిత్రపటం ద్వారా గవర్నర్‌కు వివరించారు. ముందుగా, ఖమ్మం జిల్లాలో పీఎంశ్రీ పాఠశాలల వివరాలు, అక్కడ జరుగుతున్న అభివృద్ధి పనులు వంటి అంశాల గురించి ప్లానింగ్ కో ఆర్డినేటర్ రామకృష్ణ వివరించారు. పాఠశాల హెచ్‌ఎం కృష్ణవేణి, ఉపాధ్యాయులు శారద, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

## 'ఈ విన్, యూ విన్' యాప్‌లపై అవగాహన

**నిరంతరం అప్‌డేట్ చేస్తూ టీకాలు ఇవ్వాలి: డీఎంహెచ్‌వో**



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో కళావతిబాయి

ఖమ్మం/ ఖమ్మం సిటీ, ఫిబ్రవరి 25: వైద్యాధికారులు, ఫార్మాసిస్టులు, ఆరోగ్య సిబ్బంది అందరూ 'ఈ విన్, యూ విన్' యాప్‌ల అప్‌డేట్‌పై అవగాహన పెంచుకోవాలని డీఎంహెచ్‌వో డాక్టర్ కళావతిబాయి సూచించారు. 'ఈ విన్, యూ విన్ యాప్‌లు, సాధారణ వ్యాధి నిరోధక టీకాల ప్రక్రియ' వంటి అంశాలపై ఖమ్మం ఐడీవోసీలో మంగళవారం నిర్వహించిన శిక్షణలో ఆమె మాట్లాడారు. ఫార్మాసిస్టులు, ఏఎన్‌ఎంలు సదరు యాప్స్‌ను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేస్తూ వ్యాధి నిరోధక టీకాలు అందించాలని సూచించారు. సాంకేతికంగా ఏవైనా సమస్యలు ఉత్పన్నమైతే ఎస్‌ఎంవో దృష్టికి తీసుకెళ్లి అనుమానాలను నివృత్తి చేసుకోవాలన్నారు. అసంక్రమణ వ్యాధులు, నియంత్రణ, మాతా శిశు సంక్షేమం, లెప్రసీ నివారణ లక్ష్యాలను మార్చి నెలాఖరు వరకు సాధించాలని ఆదేశించారు. అనంతరం రాష్ట్ర అధికారి డాక్టర్ జ్యోష్నా, ఎస్‌ఎంవో డాక్టర్ మురారీ శిక్షణ ఇచ్చారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సైదులు, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ చందూనాయక్, డాక్టర్ రామారావు, డాక్టర్ వెంకటరమణ పాల్గొన్నారు.

## పోలింగ్ కేంద్రం పరిశీలన



కూసుమంచి ఎమ్మెల్సీ పోలింగ్ స్టేషన్‌ను సందర్శించిన తహసీల్దార్ కరుణశ్రీ

కూసుమంచి, ఫిబ్రవరి 25: కూసుమంచి జిల్లా పరిషత్ హైస్కూల్‌లోని 111 పోలింగ్ కేంద్రాన్ని తహసీల్దార్ కరుణ శ్రీ మంగళవారం పరిశీలించారు. ఏర్పాట్లపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. పోలింగ్ జరిగే ప్రాంతంలో 144 సెక్షన్ ఉంటుందని, పోలింగ్ కేంద్రంలో విద్యుత్, తాగు నీరు, వైద్య సదుపాయాలు ఏర్పాటు చేశామని తెలిపారు. మండలంలో మొత్తం 66 మంది ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకుంటారని తెలిపారు. బుధవారం మధ్యాహ్నం వరకు పోలింగ్ సిబ్బంది వస్తారని పేర్కొన్నారు. ఆమె వెంట సర్వేయర్ రవి, సిబ్బంది పాల్గొన్నారు.